సాక్షి
నంద్యాల
శనివారం । 28 । అక్టోబర్ । 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన
ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నుంచి నవంబర్ 1వ తేదీ వరకు చిరు జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



భ్రామరికి ఊయలసేవ
శ్రీశైలం: శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి శుక్రవారం రాత్రి ఊయలసేవనిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేశారు.



చదువులమ్మ ఒడిలో..
శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు ముస్తాబైంది. శని, ఆదివారాల్లో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనేందుకు వేలాది మంది పూర్వ విద్యార్థులు తరలిరానున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

31న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల ప్రదర్శన

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి నంద్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని క్రాంతినగర్ శాంతినికేతన్ హైస్కూల్‌లో ప్రాజెక్టుల ప్రదర్శన ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. ప్రాజెక్టుల తయారీలో శాస్త్రీయ అంశాలైన పరిశీలన, సమాచార సేకరణ, ప్రయోగాలు, సమస్యల పరిష్కార మార్గాలు, అవగాహన, సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు కలిగిన ఉత్తమ సైన్స్ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం 9948605546, 8919275298ను సంప్రదించాలన్నారు.


నంద్యాల ఆర్‌డీఓగా శ్రీనివాస్ కొనసాగింపు

నంద్యాల(అర్బన్): నంద్యాల ఆర్‌డీఓగా శ్రీనివాస్‌ను తిరిగి కొనసాగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఇక్కడి నుంచి చిత్తూరు డీఆర్‌ఓగా ఆయన బదిలీ అయ్యారు. అయితే మళ్లీ నంద్యాల ఆర్‌డీఓగానే నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీశైలంలో 70.7 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 70.6682 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి ఎటువంటి వరద ప్రవాహం లేనప్పటికీ రోజూ దిగువ ప్రాంతాలకు నీరు విడుదల అవుతుండడంతో నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు దిగువ ప్రాంతాలకు 6,771 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 300 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,390, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.884 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 1,753 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 845.30 అడుగులకు చేరుకుంది.

నేడు వాల్మీకి మహర్షి జయంతోత్సవం



నంద్యాల(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద శనివారం ఉదయం 9.30 గంటలకు ఉత్సవాలను నిర్వహించున్నన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వాల్మీకులు, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కుల, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఆయుధాలపై అవగాహన



ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సావాలను పురస్కరించుకుని పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసులు ఆయుధాలు, పరికరాలు ఏ విధంగా ఉపయోగిస్తారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో రక్షణ రంగంపై ఆసక్తి ఏర్పడుతుందన్నారు. దీంతో పోలీసు, ఆర్మీలో చేరేలా లక్ష్యాన్ని నిర్ణయించుకుంటారన్నారు. అనంతరం వారికి ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, మెటల్ డిటెక్టర్, డాగ్ స్క్వాడ్ తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఉరుకుంద ఆలయం మూసివేత

కౌతాళం: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం 4గంటలకు మూసి వేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండల చైర్మన్ నాగరాజ్‌గౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

నైపుణ్యాన్ని పెంచుతూ.. ఉద్యోగానికి బాటలు వేస్తూ!

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు
- ప్రత్యేక కోర్సుల కోచింగ్ ఉచితం
- ప్రతి నెల జిల్లాలో రెండు జాబ్ మేళాల నిర్వహణ

పోటీ ప్రపంచంలో ఉద్యోగాల సాధన అంత సులువు కాదు. ఆయా రంగాల్లోని ఉద్యోగాల్లో చేరాలంటే చదువుతో పాటు ప్రత్యేక కోర్సులు చేయాల్సిన రోజులివి. మారుమూల ప్రాంతాలకు చెందిన పేద యువత ప్రధాన నగరాల్లోని కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందడం ఖర్చుతో కూడుకున్నది. ఇటువంటి పరిస్థితుల్లో నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పించడంతో పాటు జాబ్‌మేళాలతో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది.



సర్టిఫికెట్లతో మెడికల్ కోడింగ్ పూర్తి చేసిన విద్యార్థులు



నందికొట్కూరు స్కిల్ హబ్ సెంటర్‌లో ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళా వివరాలు

సంవత్సరం	జాబ్ మేళాలు	ఎంపికైన విద్యార్థులు
2019-20	02	663
2020-21	10	622
2021-22	17	1,079
2022-23	14	1,802
2023-24 (ఇప్పటి వరకు)	23	2,775

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కిల్ హబ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	స్కిల్ హబ్ కేంద్రం
డోన్	జీపీ శేషా రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
నంద్యాల	పీఎస్‌సీ, కేవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
నందికొట్కూరు	ప్రభుత్వ డిగ్రీ కళాశాల
శ్రీశైలం	ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు
ఆళ్లగడ్డ	జీటీఆర్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల
బనగానపల్లె	కృషి విజ్ఞాన్ కేంద్రం
కర్నూలు	సిల్వర్‌జూబ్లీ కళాశాల
మంత్రాలయం	ఎస్ఎంఎల్ జీడీసీ మురవణి కళాశాల
ఆదోని	న్యాక్ సెంటర్
పాణ్యం	న్యాక్ సెంటర్
ఆలూరు	ప్రభుత్వ జూనియర్ కళాశాల
కోడుమూరు	ప్రభుత్వ జూనియర్ కళాశాల
పత్తికొండ	ప్రభుత్వ డిగ్రీ కళాశాల
ఎమ్మిగనూరు	ప్రభుత్వ జూనియర్ కళాశాల
ఉమ్మడి జిల్లా పరిధిలోని స్కిల్ కాలేజీలు	
కర్నూలు	టీటీడీసీ – డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్, తాండ్రపాడు
నంద్యాల	ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, అయ్యలూరు మెట్ట

సాక్షి, నంద్యాల: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపుతోంది. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించేందుకు తోడ్పాటునందిస్తోంది. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి ప్లేస్‌మెంట్స్ కూడా కల్పిస్తోంది. నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు మెరుగైన శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్కిల్ హబ్‌లను నెలకొల్పారు. నైపుణ్యం లేక ఏ ఒక్క విద్యార్థి కూడా ఉద్యోగానికి దూరం కాకూడదని నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో స్కిల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏ నియోజకవర్గ యువత అదే నియోజకవర్గంలో శిక్షణ తీసుకునేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14 స్కిల్ హబ్స్, రెండు స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు వారికి నచ్చిన కోర్సులను నేర్చుకోవచ్చు. స్కిల్ హబ్స్ పరిధిలో మూడు నెలల పాటు ఉచిత కోచింగ్ ఇస్తారు. స్కిల్ కాలేజీ పరిధిలో ఆరు నెలల పాటు కోచింగ్ ఇస్తారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్లేస్‌మెంట్స్ కూడా కల్పిస్తున్నారు. మహిళలకు ప్రత్యేకంగా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు కోర్సు పూర్తి చేసిన వారికి ఉపాధి కోసం కుట్టు మిషన్‌ను కూడా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.

నెలకు రెండు జాబ్ మేళాలు

నిరుద్యోగుల కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతి నెల జాబ్ మేళాలను నిర్వహిస్తోంది. ఒక్కో నెల ఒక్కో నియోజకవర్గ పరిధిలో వీటిని ఏర్పాటు చేస్తోంది. నంద్యాల జిల్లా పరిధిలో నెలలో రెండో శుక్రవారం మెగా జాబ్‌మేళా, నాల్గవ మంగళవారం మినీ జాబ్ మేళా అలాగే కర్నూలు జిల్లా పరిధిలో మొదటి శుక్రవారం మెగా జాబ్ మేళా, మూడవ మంగళవారం మినీ జాబ్ మేళాను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

కోర్సులు ఉచితం

ప్రస్తుతం టెక్నాలజీ యుగం నడుస్తుండటంతో ప్రభుత్వం కూడా ఆ దిశగానే ఆలోచన చేస్తోంది. నిరుద్యోగ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందజేస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), మెషీన్ లెర్నింగ్, ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ డిజైన్, ఈ ట్యాబ్స్ రెవిట్, ఎంబెడెడ్ సిస్టమ్స్, పైథాన్, జావా, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటో క్యాడ్, ఈ – కామర్స్ మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ తదితర కోర్సులను నేర్పిస్తోంది. ఇవే కోర్సులు హైదరాబాద్, బెంగుళూరు లాంటి నగరాలకు వెళ్లి నేర్చుకోవాలంటే ఒక్కొక్కరికి సగటున రూ. 50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుంది.

డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా అవకాశం వచ్చింది



మాది నందికొట్కూరు. నేను 2023లో బీజెడ్‌సీ పూర్తి చేశాను. డిగ్రీ పూర్తవగానే స్థానికంగా నందికొట్కూరు డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో జాయిన్ అయ్యాను. ఏప్రిల్ నుంచి మూడు నెలల పాటు కోచింగ్ తీసుకున్నా. జూన్‌లో కోర్సు పూర్తయిన తర్వాత నిర్వహించిన జాబ్ మేళాకు హాజరయ్యాను. హైదరాబాద్‌లోని వింధ్య ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.2 లక్షల ప్యాకేజీ ఇస్తున్నారు. – ఈడిగ నందిని, నందికొట్కూరు

రూ.3.5 లక్షల ప్యాకేజీతో జాబ్



నేను 2022లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఈసీఈ పూర్తి చేశా. అదే ఏడాది అక్టోబర్‌లో నంద్యాల డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్‌లో కోర్సు జాయిన్ అయ్యాను. మాకు జావా, సీ లాంగ్వేజెస్ నేర్పించి సర్టిఫికెట్ ఇచ్చారు. అక్కడ తీసుకున్న ట్రైనింగ్‌తో ఉద్యోగ ప్రయత్నం చేయడంతో బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.3.5 లక్షల వేతనంతో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇదే కోర్సు నేను హైదరాబాద్‌లో చేసి ఉంటే రూ.50 వేలు అయ్యేది. – సయ్యద్ జావేద్ బాషా, దేవనగర్, నంద్యాల

కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగయ్యాయి



నంద్యాలలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో నేను బీజెడ్‌సీ పూర్తి చేశాను. పట్టణంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రంలో మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ కోర్సులో జాయిన్ అయ్యాను. మూడు నెలల పాటు ఇక్కడ కోచింగ్ తీసుకున్నా. ఇప్పుడు హైదరాబాద్‌లోని ఇంటెంట్ హెల్త్ కేర్‌లో వర్క్ చేస్తున్నా. ఏడాదికి రూ.1.8 లక్షల ప్యాకేజీతో వేతనం ఇస్తున్నారు. – పి. అరుణకుమారి, నంద్యాల

ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి

నిరుద్యోగ యువత ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కోర్సులు బయట నేర్చుకుంటే రూ.వేలల్లో ఖర్చవుతుంది. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్, పార్లమెంట్ పరిధిలో స్కిల్ కాలేజీలు ఉన్నాయి. అనుకూలన ప్రాంతంలో నచ్చిన కోర్సు నేర్చుకోవచ్చు. ఇతర వివరాలకు 8297812530ను సంప్రదించవచ్చు. – ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి సమస్యను విన్నవిస్తున్న వ్యక్తి

దొర్నిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి జగనన్న చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ 21, ఆర్‌డబ్ల్యూఎస్ 5, హౌసింగ్ 6, ఎండోమెంట్ 1, ఎంపీడీఓ పరిధిలో 7, విద్యుత్ 3, వ్యవసాయశాఖ నుంచి 1, సీసీరోడ్లుపై 3, ఆరోగ్యశాఖ 2, నీటిపారుదల శాఖ 2 ఇలా మొత్తం 51 వినతులు అందాయి. అనంతరం కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం – స్పందనలో వచ్చే వినతులు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికంగా ఆర్‌ఓఆర్ సమస్యలను వస్తున్నాయని వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు పనులపై శ్రద్ధపెట్టాలని పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా సీహెచ్‌ఓలు స్థానిక హెల్త్‌క్లినిక్‌లలో ఉంటున్నారా లేదా అని వైద్యాధికారి నాగేంద్రను ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సర్పంచి దేవమణి తదితరులు పాల్గొన్నారు.

దిగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



విశ్వక్సేనుడిని యాగశాలకు తోడ్కొని వస్తున్న అర్చకులు,



పవిత్రోత్సవానికి అంకురార్పణ చేస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం శ్రీ ప్రహ్లాదవరదస్వామి ఆలయంలో నాలుగురోజుల పాటు జరిగే వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం విశ్వక్సేనారాధనం, మృత్సంగ్రహణం యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో సోమకుంభ స్థాపనం చేశారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణలతో ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులకు తిరుమంజనం నిర్వహించి నూతన పట్టు పీతాంబరాలతో అలంకరించి ప్రత్యేక మండపంలో కొలువుంచి ఆదిహోమం నిర్వహించారు. ఈ పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పవిత్రోత్సవ విశిష్టత

ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్యకైంకర్యాలు, వార, మాస, వార్షిక ఉత్సవాలు, ఇతరత్రా పూజాది కార్యక్రమాల్లో తెలసీ తెలియక చేసిన తప్పుల వలన ఏర్పడే దోష నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓ సస్పెన్షన్

నంద్యాల: రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా భూములను నమోదు చేసిన డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెం.929లో 10.04 ఎకరాల విస్తీర్ణ దేవదాయ భూములను రెవెన్యూ రికార్డులో తారుమారు చేసిన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు సస్పెండ్ చేశారు. అలాగే ఇందుకు సహకరించిన 80 బన్నూర్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వెంకటరమణను కూడా సస్పెండ్ చేశారు. వీరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం

- స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 ఓటరు ముసాయిదా జాబితా విడుదల
- జిల్లాలో 13,57,998 మంది ఓటర్లు.
- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటన


నంద్యాల(అర్బన్): జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో వారి సంఖ్య ఎక్కువగా ఉంది. నంద్యాల జిల్లా ప్రత్యేక ఓటర్ల జాబితా 2024 సవరణకు సంబంధించిన ముసాయిదాను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విడుదల చేశారు. అందులో భాగంగా జిల్లాలోని ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో 1,621 పోలింగ్ కేంద్రాల పరిధిలో 13,57,998 మంది ఓటర్లు ఉన్నారు. ఈ జాబితాలో పురుష ఓటర్లు 6,68,475 మంది ఉండగా మహిళా ఓటర్లు 6,89,252 మంది ఉన్నారు. ఇతరులు 271 మంది ఉన్నారు. పురుషుల కంటే 20,777 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండటంతో మహిళలే నిర్ణేతలుగా మారనున్నారు. అత్యధికంగా నంద్యాల నియోజకవర్గంలో 2,62,696 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో బనగానపల్లె నియోజకవర్గంలో 2,38,803 మంది ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా శ్రీశైలం నియోజకవర్గంలో 1,92,942 మంది ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లు మొత్తం 2,803 మంది ఉండగా అందులో 2,750 మంది పురుషులు, 53 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా 559 మంది ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉండటం విశేషం. అత్యల్పంగా నందికొట్కూరు నియోజకవర్గంలో 307 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల సంఘం ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2024లో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటా తిరిగి అనుమానపు ఓటర్లపై దృష్టి సారించారు. ఒకే కుటుంబంలో పది, పదికంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వివరాల సేకరించి విచారణ చేపట్టారు. అలాగే ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ ఓటర్లను భారీగా తొలగించారు. ఈ ముసాయిదా ఓటరు జాబితా జిల్లా ఎన్నికల కార్యాలయం, ఆర్‌ఓ, ఈఆర్‌ఓలు, అన్ని పోలింగ్ కేంద్రాల్లోని ప్రదర్శనకు ఉంచుతారు.

జనవరి 5న తుది జాబితా ప్రకటన



ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. జాబితాలోని ఓటర్లలో అనర్హులు ఉన్నా, మరణించిన వారి పేర్లు ఉన్నా, తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన వారు ఉన్నా, పేర్లు, ఊర్లు, నియోజకవర్గాల మార్పులు తదితర మార్పులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇందుకోసం డిసెంబర్ 9 తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు తెలపవచ్చు. ఒక్క ఓటరు ఐదుగురు కంటే ఎక్కువ మందిపై ఒక్కసారి ఫిర్యాదు చేయవచ్చు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రతి బూత్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 27వ తేదీలోపు పరిశీలించి తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రకటిస్తారు.

అభ్యంతరాలను తెలపండి



నంద్యాల: ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో ప్రత్యేక ఓటర్ల సవరణ –2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్, పోలింగ్ స్టేషన్ల పెంపు, తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ –2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు సంబంధించిన వివరాలు తెలియజేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, క్లెయిమ్స్ ఉంటే తెలియజేయాలన్నారు. వాటిని డిసెంబర్ 26వ తేదీ నాటికి మొత్తం పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. జనవరి 5వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నుంచి అమృతరాజ్, బీజేపీ నుంచి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, సీపీఐఎం ప్రతినిధిగా పూల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆళ్లగడ్డ	295	1,11,793	1,13,930	18	2,25,741
శ్రీశైలం	226	94,736	98,166	40	1,92,942
నందికొట్కూరు	251	1,05,196	1,08,523	12	2,13,731
నంద్యాల	281	1,28,078	1,34,527	91	2,62,696
బనగానపల్లె	277	1,17,924	1,20,847	32	2,38,803
డోన్	291	1,10,748	1,13,259	78	2,24,085
మొత్తం	1621	6,68,475	6,89,252	271	13,57,998

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

- ప్రకృతి వైపరీత్యాలను రాజకీయానికి వాడుకోవడం సిగ్గు చేటు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, అధికారులు

ఆళ్లగడ్డ: రైతులు అధైర్య పడొద్దని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం దొర్నిపాడు సమీపంలోని కాల్వకట్ట నుంచి డాక్టర్ కొట్టాల, రాజానగరం వరకు కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రిజర్వాయర్లలో ఈ ఏడాది నీటి వనరులు తక్కువగా ఉండటంతో కేసీ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. చివరి ఆయకట్టుకు నీరందేలా వారబందీని మరో రెండు రోజులు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఒకరికొకరు సహకరించుకుంటూ తమ పొలం తడిచిన వెంటనే కిందకు నీరు పోయేలా చూడాలన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరమైతే అందరికీ సక్రమంగా సాగునీరు పారించేందుకు రాత్రిళ్లు కట్టపైనే బస చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాలకు చెందిన కొంత మంది ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. రైతులకు ధైర్యం చెప్పాల్సింది పోయి ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది అని అధైర్య పరుస్తూ మానసికంగా కుంగిపోయేలా చేయడం సరికాదన్నారు. రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉంటే రైతులకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, అమర్‌నాథరెడ్డి, నాగేశ్వర్‌రావు, చెంచిరెడ్డి రైతులు ఉన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌యూ టెండర్లకు నేడే ఆఖరు

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని ఆస్పరి, పెద్దకడబూరు మండల కేంద్రాల్లో పీహెచ్‌యూ (పబ్లిక్ హెల్త్ యూనిట్లు) భవన నిర్మాణాలకు టెండర్లు వేయడానికి శనివారం ఆఖరు గడువని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌యూ నిర్మాణాలకు రూ.67.1 కోట్లతో టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల లోపు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు వేయాలని పేర్కొన్నారు.

పదవీ కాలం పొడిగింపు


చంద్రమౌళి రెడ్డి

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ డి.వి. చంద్రమౌళి రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఈయన 2022 అక్టోబర్ 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక శాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వచ్చారు. డివిజినల్ మేనేజర్‌గా ఏడాది కాల పరిమితితో నియమితులయ్యారు. ఈ నెల 20వ తేదీతో పదవీ కాలం పూర్తి కావడంతో మరో ఏడాది పొడిగిస్తూ ఏపీటీడీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

సీసీ టీవీ కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు సీసీ టీవీ కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. నవంబర్ 8 నుంచి 13 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ సమయంలో 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు అభ్యర్థులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అప్పులబాధతో ఆత్మహత్య


సామెల్(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మిగనూరు పట్టణం సోగనూరు రోడ్డులో శుక్రవారం ఈ ఘటన వెలుగు చూసింది. టౌన్ సీఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. సోగనూరు రోడ్డు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ జేమ్స్ పెద్ద కుమారుడు సామెల్(44) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు భార్య సునీత, కుమార్తెలు దానమ్మ, మీన, మిల్కీ, కీర్తన, జ్యోతి ఉన్నారు. కుటుంబ పోషణ, ఇతర అవసరాల నిమిత్తం రూ. 5 లక్షలకు పైగా బయట వ్యక్తుల దగ్గర అప్పు చేశాడు. వడ్డీ పెరిగిపోవటం, అప్పు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయటంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. సోగనూరు రోడ్డులోని ఖాళీ స్థలంలో పాతిన పోల్‌కు తాడుతో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చదువులమ్మ ఒడిలో 60 ఏళ్ల పండుగ

- వజ్రోత్సవాలకు శ్రీశైలం ప్రాజెక్ట్ హైస్కూల్ సిద్ధం
- నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ
- తరలివస్తున్న పూర్వ విద్యార్థులు

అక్కడ పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మను ఒడిసిపట్టి గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన మహా సంకల్పంలో ఎందరో భాగస్వాములయ్యారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణంలో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగాలు, జీవనోపాధి నిమిత్తం అక్కడికి చేరుకున్నారు. వారి పిల్లల కోసం అప్పుడు అక్కడో చదువుల కోవెల వెలిసింది. ఎంతో మందిని తీర్చిదిద్దింది. ఎంతలా అంటే కృష్ణా జలాలు బీడు భూములను ఎలా సస్యశ్యామలం చేశావో అలా ఇక్కడ చదువుకున్న వారు వివిధ హోదాల్లో స్థిరపడి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. వారంతా నేడు అదే చదువులమ్మ ఒడిలో మరోసారి సమ్మేళనమవుతున్నారు. వజ్రోత్సవాలు జరుపుకుంటున్న శ్రీశైలం ప్రాజెక్ట్ హైస్కూల్ గురించి ప్రత్యేక కథనం.


వజ్రోత్సవానికి సిద్ధమైన ఉన్నత పాఠశాల



ఒకరోజు ముందుగానే చేరుకున్న పూర్వ విద్యార్థులు,అవయవదాన కరపత్రం విడుదల చేస్తున్న స్పోసా చైర్మన్ లక్ష్మీనారాయణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60 ఏళ్లు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలకు ముస్తాబైంది. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (స్పోసా) ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. 60 ఏళ్లలో ఈ పాఠశాలలో చదువుకున్న వారందరూ ఒక వేదికపై కలవాలనే సంకల్పంతో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తున్నారు. సుమారు 7వేల మంది విద్యార్థులు వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది. వారికి అవసరమైన వసతి, అల్పాహారం, భోజనం సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు శనివారం ఆరు వేల మందితో (అలూమినీ యాంతం) స్పోసా గీతాన్ని పాడనున్నారు. ఈ ఆలాపన వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్‌లో నమోదుకానుంది. ఆదివారం ఉదయం మెగా రక్తదాన, అవయవదాన శిబిరాన్ని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే శ్రీశైలం డ్యాం, ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన ఉద్యోగులను సన్మానించనున్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులంతా సంఘంగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం, పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములై ఆదర్శంగా నిలుస్తున్నారు. పూర్వ విద్యార్థులు తమవంతుగా పాఠశాలలో మరమ్మతులు, పెయింటింగ్, సీసీ రోడ్డు నిర్మాణం వంటి పనులను చేయించారు. స్పోసా చైర్మన్, సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగే వజ్రోత్సవ వేడుకలకు అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి, తదితరులు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

పాఠశాల చరిత్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సాగు, తాగునీరు, విద్యుత్ ఉత్పాదన కోసం నాటి దేశప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1963 జూలై 24న శ్రీశైలం డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, శ్రామికుల పిల్లల చదువుల కోసం నీటిపారుదల శాఖ ఉన్నత పాఠశాలను నిర్మించింది. ఉపాధ్యాయులను నియమించి వారికి జీతాలు చెల్లించడమే కాకుండా, పాఠశాల పరిపాలనను కూడా చూసుకునేది. అప్పట్లో ఏర్పడిన శ్రీశైలం డ్యాం ఈస్ట్ (కర్నూలు జిల్లా, సున్నిపెంట), శ్రీశైలం డ్యాం వెస్ట్ (తెలంగాణలోని మహబూబ్‌నగర్‌జిల్లా దోమలపెంట, ఈగలపెంట)లో నివసించే వారి పిల్లలంతా ఈ పాఠశాలలోనే చదువుకునేవారు.1982లో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఈ ఉన్నత పాఠశాలను విలీనం చేసుకుంది. ఎందరో ఈ పాఠశాలలో చదువుకున్న వారు అత్యున్నత అధికారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. చదువుకున్న పాఠశాల, పుట్టిన ఊరి కోసం పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి సహాయ, సహకారాలు అందిస్తున్నారు.

స్పోసా ఆధ్వర్యంలో అభివృద్ధి

శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పడిన తరువాత ఇక్కడి ఉన్నత పాఠశాల, కళాశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.1.5 కోట్లతో తరగతి భవనాల మరమ్మతులు, మెగా మెడికల్ క్యాంప్, అవయవదాన, రక్త దాన శిబిరాలను నిర్వహించారు. పేద విద్యార్థులకు గతంలో ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. టీచర్ల కొరత ఉండడంతో పాఠశాలలో విద్యాకమిటీ ఆధ్వర్యంలో వలంటీర్లను నియమించి వారికి స్పోసానే జీతాలను కూడా చెల్లించింది. అంతే కాకుండా 10వేల మొక్కలను నాటి పర్యావరణంపై అవగాహన కల్పించారు.

పాఠశాలలో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు..

- వీవీఎస్.లక్ష్మీనారాయణ, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్
- జి.అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ
- రామ్‌మోహన్‌రావు, తెలంగాణజెన్‌కో డైరెక్టర్
- కేవీఎన్ ప్రసాద్, పర్సనల్ సెక్రటరీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా
- ఎస్.హరినాథ్, పర్సనల్ సెక్రటరీ మాజీ మంత్రి అచ్చెంనాయుడు
- యు.ఇలియాజర్, జాయింట్ సెక్రటరీ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్
- డాక్టర్.వరప్రసాద్, (రిటైర్డ్), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్
- డాక్టర్.జ్యోత్స్న, (రిటైర్డ్) నిమ్స్ డైరెక్టర్
- సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, నంద్యాల
- ఎ.వెంకటేశ్వర్లు, వ్యాపారవేత్త
- విద్యాధరరావు, టీచర్, ఉన్నత పాఠశాల
- వైద్యులు జి.గీతా అరుణ, డి.మిరియాజిరావు, ఇన్నయ్య, స్వర్ణలత
- జి.ఎస్.రావు, ప్రముఖ సినీ రచయిత, డైరెక్టర్
- ఎ.మల్లికార్జున, సినీనటుడు

హెచ్‌ఎంగా ఉండటం అదృష్టం



నేను హెడ్ మాస్టర్‌గా బాధ్యతలు చేపట్టి కొంతకాలమే అయ్యింది. నా హయాంలో 60 వసంతాల వజ్రోత్సవం జరుగుతుండటం అదృష్టంగా భావిస్తున్నా. ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న పాఠశాలకు ఇలాంటి సేవలు అందిస్తే పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. అంతేకాకుండా వారు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు.

– ఈశ్వరమ్మబాయి, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల

సేవ చేయడం పూర్వజన్మ సుకృతమే



పుట్టినగడ్డను, చదువుకున్న పాఠశాలను, చదువు నేర్పిన గురువులను మరవొద్దు అనేది భావిభారత పౌరులకు నేనిచ్చే సందేశం. ఎప్పుడో చదువుకున్న పాఠశాలకు ఇలా సేవలు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. కలిసికట్టుగా పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, స్థానికులు పాఠశాల వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని కోరుకుంటున్నా.

–డాక్టర్. యు.ఇలియాజర్, జాయింట్ సెక్రటరీ, వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్

క్రీడోత్సవం.. భక్తిభావం

- గొరవయ్యలతో హోరెత్తిన 'దేవరగట్టు'


సింహాసన కట్ట మీద ఉత్సవ మూర్తులు


నృత్యం చేస్తున్న గొరవయ్యలు

హొళగుంద: దేవరగట్టులో శుక్రవారం గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గొలుసు తెంపే కార్యక్రమం ఉత్కంఠ రేపింది. వసంతోత్సవం వైభవంగా సాగింది. ఆచారాన్ని అనుసరిస్తూ కంకణ విసర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. జైత్రయాత్ర అనంతరం సింహాసన కట్టమీద కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఎదుట శుక్రవారం గొరవయ్యలు తమ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. పిల్లనిగ్రోవి ఊదుతూ, త్రిశూలం చేతబట్టి, డమరుకాలను ఆడిస్తూ లయబద్ధంగా నృత్యం చేశారు. చాటిలతో కొట్టుకుంటూ ఉద్వేగంగా వచనాలు చెప్తూ పూనకంతో ఊగిపోయారు. పిల్ల గొరవయ్యలు దైవ వచనాలు వల్లెవేస్తూ అందుకు తగ్గట్టు హావభావాలు ప్రదర్శిస్తూ నృత్యం చేసి భక్తులను ఆశ్చర్యపరిచారు.

రెండు జతికలకు తెగిన గొలుసు

ఉత్సవంలో భాగంగా ఇనుప గొలుసును హాలహర్వి మండలం బల్లూరు గ్రామానికి చెందిన గొరువయ్య గాదిలింగప్ప రెండు జతికలకు తెంపాడు. మల్లప్ప గుడి ముందు ప్రతి ఏటా ఇనుప గొలుసు తెంపడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా శనివారం దాదాపు 20 కేజీల బరువున్న గొలుసును రెండు జతికలకు తెంపడంతో భక్తులు గొరువయ్యను భుజాల మీదెత్తుకుని ఈలలు, కేకలు వేస్తూ ఆనందంతో నృత్యాలు చేశారు. గతేడాది 3 జతికలకు గొలుసు తెగితే ఈ ఏడాది రెండు జతికలకు తెగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దేవదాసిల క్రీడోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నెరణికి గ్రామానికి చెందిన ఒక సామాజిక వర్గం ప్రజలు బసివినులను ఎత్తుకుని నృత్యాలు చేశారు. అనంతరం రంగు నీళ్లను భక్తులపై చల్లి వసంతోత్సవం, కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించారు. మాళమల్లేశ్వర విగ్రహాలతో పాటు పల్లకీని భక్తులు ఊరేగింపుతో కొండ పైనున్న ఆలయానికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఉత్సవాల ముగింపు

మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు శనివారం దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి చేరుతాయి. వీధుల్లో ఊరేగింపు అనంతరం రాత్రి 12 గంటలకు గ్రామంలోని ఆలయానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయెుద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. శుక్రవారం కల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే జిల్లా వరకు రావలసిన అవసరం ఉండబోదన్నారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేయాలి

రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల రీసర్వే చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తమే మండల స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్నటేకూరులోని రాణితోట స్థలంలో ప్రభుత్వానికి ఉపయోగపడే కార్యాలయాలు, నర్సరీలు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. లక్ష్మీపురం జగన్నాథగట్టులో 2013లో పట్టాలు మంజూరైన లబ్దిదారులకు ప్లాట్లు చూపించాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీపీ శారద, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మీ పిల్లలకు ఇవే భోజనాలు పెడతారా?

- చేతకాకపోతే వెళ్లిపోండి
- కస్తూర్బా విద్యాలయ సిబ్బందిపై పత్తికొండ ఎమ్మెల్యే ఆగ్రహం


గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: "మీ ఇంట్లో పిల్లలకు ఇలాంటి భోజనాలే పెడతారా? చేతకాకపోతే వెళ్లిపోండి " అంటూ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దికెర కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మెనూ పాటించడం లేదని పత్రికల్లో వార్తలు రావడంతో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 55 మంది విద్యార్థులకు 25 గుడ్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఇక ముందు ఇలా జరిగితే ఇంటికి పోవాల్సిందేనని హెచ్చరించారు. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారి వేణుగోపాల్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతి రోజూ విద్యాలయాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, నాయకులు సీతారామిరెడ్డి, కృష్ణ, రామాంజులు ఉన్నారు.

విధుల నుంచి ప్రిన్సిపాల్ తొలగింపు

మద్దికెర కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ జ్యోతిని విధుల నుంచి తొలగిస్తూ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు పేరుసోముల విద్యార్థి


పేరుసోముల పాఠశాల క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు

సంజామల: గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి జంప్ రోప్ క్రీడలో పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మనోజ్ ఆచారి ప్రతిభ చాటారు. తెనాలిలో జరిగిన అండర్–17 విభాగంలో 30 సెకండ్స్ స్పీడ్ ఈవెంట్‌లో బంగారు పథకం సాధించాడు. దీంతో డిసెంబర్ నెల బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైయ్యారని హెచ్‌ఎం శంకర్‌రెడ్డి తెలిపారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన నందిని, వైష్ణవి ఇటీవల నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం మనోజ్ ఆచారిని, నందిని, వైష్ణవితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కొండుపల్లె విద్యార్థిని తేజస్విని..

ఉయ్యాలవాడ: మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతన్న తేజస్విని అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు శుక్రవారం తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 15,16 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తేజస్విని తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. డిసెంబర్ 10,11 తేదీల్లో అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ మేరకు విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో నంద్యాలలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సెక్టోరల్–1 పోస్టుకు నిబంధనలు అనుసరించి పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31-10-2023 నాటికి 50 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి, జిల్లాలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మాత్రమే అర్హులన్నారు. మండల విద్యాశాఖ అధికారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో విద్యార్హతతో కూడిన నకలు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

మత్తు పదార్థాలపై పక్షం రోజులకోసారి తనిఖీ

- ప్రతి 15 రోజులకొకసారి పాఠశాలలు, కాలేజీ పరిసరాల్లో పోలీసులు తనిఖీలు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): సీ బెళగల్ మండలం బురాన్‌దొడ్డి-2 పాఠశాలల సమీపంలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న దృశ్యాన్ని తాను స్వయంగా చూశానని, ఇక నుంచి ప్రతి 15 రోజులకొకసారి పాఠశాలలు, కాలేజీలు, వాటి పరిసరాల్లో తనిఖీలు నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. .మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మత్తు వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల నోటీస్ బోర్డుల్లో పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో శ్రామికులు, కార్మికులు ఉండే ప్రదేశాలు, నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలు, పాడుబడ్డ బావులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో మత్తు పదార్థాల నియంత్రణ కోసం తరచూ గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 కేసులు నమోదు చేసి 54 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ నీలపు రామలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, డీటీసీ శ్రీధర్, డీఈఓ రంగారెడ్డి, డీఎఫ్ఓ పల్లె శివశంకర్‌రెడ్డి, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు పాల్గొన్నారు.